క్లుప్తంగా

మృతుల కుటుంబాలకు తోట పరామర్శ



కిర్లంపూడి వేగి రామకృష్ణను పరామర్శిస్తున్న తోట నరసింహం, రాంజీ

కిర్లంపూడి: మండలంలోని పలువురు మృతుల కుటుంబాలను శనివారం మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ కో ఆర్డినేటర్ తోట నరసింహం పరామర్శించారు. కిర్లంపూడిలోని వేగి రామకృష్ణ చినతండ్రి వేగి రమణ, ఉట్లలగుడిసె గ్రామానికి చెందిన మాజీ వార్డు మెంబర్ శరకణం సీత, గెద్దానాపల్లిలో ఎంపీటీసీ బొడ్డేటి నాగలక్ష్మి భర్త గోవిందు ఇటీవల మృతి చెందారు. ఆయా కుటుంబాలను తోట నరసింహం, యువ నాయకుడు తోట రాంజీ పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తోట బాబ్జీ, పెనగంటి రాజేష్, అడారి మహేష్, కర్రి వెంకటరమణ, పెంటకోట నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

జీయన్న ఆలయానికి ఇన్వర్టర్ అందజేత

గండేపల్లి: మండలంలోని తాళ్లూరు జీయ్యన్న మఠంలో వేంచేసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయానికి దాత ఇన్వర్టర్ సమర్పించారు. సుమారు రూ.30,000 విలువ గల ఇన్వర్టర్‌ను జగ్గంపేట మండలం మల్లిశాలకు చెందిన ఇంజరపు దుర్గ దంపతులు అందజేసినట్టు ఆలయ అర్చకులు ముప్పిడూడల రమేష్, భాస్కరరావు, కె.రామకృష్ణ తెలిపారు. ఇన్వర్టర్‌ను శనివారం ప్రారంభించారు.

అన్నసమారాధన

గండేపల్లి: తాళ్లూరు మఠంలో శనివారం అన్న సమారాధన నిర్వహించారు. ఆదిత్య హాస్పటల్ వైద్యులు మేకా గంగాధర్, పద్మావతి, బొడ్డు సత్యనారాయణ, ఉడతా వీర చక్రరావు ఆర్థిక సహాయంతో అన్నదానం నిర్వహించినట్టు ఆలయ అధికారులు తెలిపారు. శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న భక్తులు అన్నప్రసాదాలు స్వీకరించారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

గండేపల్లి: మండలంలోని గండేపల్లిలో ఐదు రోజుల పాటు నిర్వహించిన వాలీబాల్ పోటీల విజేతలకు శనివారం బహుమతులు అందజేశారు. జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా నిర్వహించిన ఈ పోటీలల్లో ప్రథమ బహుమతి గెలుచుకున్న రాజమహేంద్రవరం టీమ్‌కు రూ.25 వేలు, ద్వితీయ స్థానం పొందిన మురారి జట్టుకు రూ.15 వేలు, తృతీయ బహుమతి రాజానగరం టీమ్‌కు రూ.10 వేలతో పాటు ట్రోఫీలను ఎస్సై యువి శివనాగబాబు, మురారి ఉప సర్పంచ్ జాస్తి వసంత్, సుంకవిల్లి రమేష్ అందజేశారు.

కొనసాగుతున్న ఆర్టీసీ ఉద్యోగుల ఆందోళనలు



ఏలేశ్వరంలో ఆందోళన చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

ఏలేశ్వరం: స్థానిక ఆర్టీసీ డిపో డ్రైవర్‌ను అక్రమంగా సస్పెండ్ చేయడాన్ని వ్యతిరేకిస్తూ ఆర్టీసీ ఉద్యోగులు చేస్తున్న ఆందోళనలు శనివారం 43వ రోజూ కొనసాగాయి. జేఏసీ ఆధ్వర్యంలో డిపో గేట్ వద్ద ఉద్యోగులు ప్లకార్డులతో ధర్నా చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక ఆర్టీసీ డిపో డ్రైవర్ ఎస్వీ రమణను 1/2009 సర్కులర్‌కు విరుద్ధంగా అక్రమంగా సస్పెండ్ చేశారన్నారు. ఉద్యోగులు ధర్నాలు చేస్తున్న యాజమాన్యం స్పందించకపోవడం దారుణమన్నారు. ఎస్వీ రమణను విధుల్లోకి తీసుకునే వరకు ఉద్యమం చేస్తామన్నారు. ఎన్ఎంయూ డిపో కార్యదర్శి టి.త్రిమూర్తులు, యూబీఎం కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు



వీరాంజనేయులు (ఫైల్)

కిర్లంపూడి: వ్యక్తి అదృశ్యంపై కిర్లంపూడి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైనట్టు శనివారం హెడ్ కానిస్టేబుల్ ఎన్. వెంకటరమణ తెలిపారు. వివరాల్లోకి వెళితే... కాకినాడ శ్రీరాంనగర్‌కు చెందిన ఓసే వీరాంజనేయులుకు 5 ఏళ్ల క్రితం కిర్లంపూడి మండలం జగపతినగరం గ్రామానికి చెందిన కసిరెడ్డి శివరామకృష్ణ కూతురు గనిలక్ష్మితో వివాహమైంది. కొంతకాలంగా భార్యభర్తలు తరచూ గొడవ పడడంతో గనిలక్ష్మి తండ్రి వద్దనే ఉంటోంది. ఈ నెల 4న వీరాంజనేయులు కిర్లంపూడి వచ్చి భార్యను తనతో రమ్మని చెప్పగా రానని చెప్పడంతో మళ్లీ గొడవలు మొదలయ్యాయి. స్థానిక పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టినా సమస్య పరిష్కారం కాకపోవడంతో అక్కడి నుంచి కాకినాడ వెళ్లిన ఆయన కనబడకుండా పోయాడు. దీంతో రామాజంనేయులు తల్లి ఓసే రాజేశ్వరి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. రామాజంనేయులు ఆచూకీ తెలిస్తే 94407 96529, 94409 04834 నంబర్లకు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

హోరు గాలి.. జోరు వాన

- ఈదురు గాలులతో భారీ వర్షం
- జలమయమైన రహదారులు



ఎస్.అన్నవరం శివారు గెడ్లబీడు వద్ద ఈదురు గాలులతో కురుస్తున్న వర్షం

ప్రత్తిపాడు: మండలవ్యాప్తంగా శనివారం సాయంత్రం వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. సాయంత్రం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై ఈదురు గాలులతో వర్షం కురిసింది. మండలంలో 1,490 హెక్టార్లలో ఈ ఏడాది రబీ వరిసాగు చేశారు. దాదాపు 90 శాతం మంది రైతులు కోతలు పూర్తి చేసి పంట ఒబ్బిడి చేసుకున్నారు. ప్రత్తిపాడు, లంపకలోవ తదితర గ్రామాల్లో రైతులు పశు గ్రాసం కోసం కూలీలతో వరి కోతలు చేపటడంతో పంట పనలపై ఉంది. హఠాత్తుగా కురిసిన వర్షానికి పనలు తడిసిపోయాయి. తడిసిన పనలపై ఐదు శాతం ఉప్పు ద్రావణం చల్లాలని మండల వ్యవసాయాధికారి యింటి వీర గంగాధర్ సూచించారు. ఎండ వేడిమితో అల్లాడిన ప్రజలు వర్షంతో ఉపశమనం పొందారు.

తుని: ఎండ తీవ్రత, ఉక్కబోతతో విలవిల్లాడిన ప్రజలకు వర్షం ఊరటనిచ్చింది. శనివారం సాయంత్రం ఈదురు గాలితో కూడిన వర్షం కురిసింది. గాలి తీవ్రతను దృష్టిలో పెట్టుకుని విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. వాతారణం చల్లబడటంతో ప్రజలు ఉపశమనం పొందారు. మామిడి, అరటి రైతులకు నష్టం కలిగింది. అసలే అరకొరగా కాసిన మామిడి పిందెలు రాలిపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

తుని రూరల్: మండలంలో ఈదురు గాలులతో వర్షం కురిసింది. శనివారం మధ్యాహ్నం 3.30 గంటలకు ఆకాశంలో మబ్బులు కమ్ముకుని ఈదురు గాలులతో కూడిన ఓ మోస్తారు వర్షం కురిసింది. వేసవి తాపంతో అల్లాడిపోయిన గ్రామీణులకు వర్షంతో ఉపశమనం లభించింది. ఈదురు గాలుల కారణంగా మామిడికి స్వల్ప నష్టం వాటిల్లినట్టు రైతులు పేర్కొన్నారు. ఈ వర్షం ఆరుతడి పంటలకు మేలు చేస్తుందని వ్యవసాయ అధికారులు తెలిపారు.

కోటనందూరు: మండల వ్యాప్తంగా శనివారం సాయంత్రం ఈదురుగాలులతో భారీవర్షం కురిసింది. మధ్యాహ్నం 3 గంటల వరకూ భానుడి ఉగ్రరూపం దాల్చాడు. ఆ తరువాత మేఘావృతమైన ఆకాశంతో చల్లబడింది. భారీ ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈదురుగాలులకు కాకరాపల్లిలో 100 ఎకరాల్లో వరిపైరు నేలకొరిగింది. మండల వ్యాప్తంగా మామిడి, జీడిమామిడి పిందెలు నేల రాలిపోయాయి. అకాలవర్షం అన్నదాతకు తీవ్ర నష్టాన్ని తెచ్చి పెట్టగా వేసవితాపంతో సతమతమైపోతున్న ప్రజానికానికి ఉపశమనం కలిగించింది. ఏఓ చంద్రశేఖర్, ఈఏఓలు శివకుమారి, సురేష్ మండలంలో పర్యటించి జరిగిన నష్టాన్ని అంచనా వేశారు.



కాకరాపల్లిలో నేలకొరిగిన వరి చేను

రారండోయ్ వేడుక చూద్దాం

- సీతారాముల కల్యాణానికి సర్వం సిద్ధం
- గ్రామాల్లో ఆలయాలు ముస్తాబు



ప్రత్తిపాడులో కొలువుదీరిన సీతారాములు

ప్రత్తిపాడు: శ్రీరామనవమి వేడుకలకు సర్వం సిద్ధమైంది. ఆదివారం శ్రీరామనవమిని పురస్కరించుకుని గ్రామాల్లో సీతారాముల కల్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించున్నారు. ఈ మేరకు పల్లెల్లో ఆలయ కమిటీలు ఏర్పాట్లు పూర్తి చేశాయి. ప్రత్తిపాడులోని మునసబు గారి రామాలయం, బజారువీధి రామాలయం, జక్కావారి రామాలయం, కొత్తపేట, గోకవరం వీధి, పల్లపు వీధి తదితర రామాలయాల వద్ద రాములోరి కల్యాణ వేడుకలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. మండలంలోని ఏలూరు, చినశంకర్లపూడి, పెదశంకర్లపూడి, లంపకలోవ, టి.రాయవరం, పి.జగన్నాథపురం తదితర గ్రామాల్లో రామాలయాలకు తోరణాలు కట్టారు. స్థానిక నరేంద్రగిరిపై గల శ్రీరామ నామక్షేత్రంలో ఆదివారం సాయంత్రం సీతారాముల కల్యాణ మహోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. పలు ఆలయాల వద్ద చలువ పందిళ్లు వేసి విద్యుద్దీపాలంకరణలు చేశారు. ఆలయ పరిసరాలను రంగవల్లులతో తీర్చిదిద్దారు.

భక్తిశ్రద్ధలతో సీతారాముల మెట్లపూజ

రౌతులపూడి: ములగపూడి రామగిరికొండపై వెలసిన పురాతన సీతాకోదండరాముని కల్యాణ మహోత్సవం సందర్భంగా శనివారం స్వామివారి మెట్లు పూజ నిర్వహించారు. స్వామివారి కల్యాణ మహోత్సవాలు ఐదు రోజుల పాటు అత్యంత వైభవంగా జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా స్వామివార్లకు అష్టోత్తర శతనామావళి, హనుమాన్ పూజలు, ధ్వజారోహణ నిర్వహించారు. స్వామివారి మాలాధారణ చేసిన భక్తులు మెట్లను పసుపు కుంకుమలతో సుందరంగా అలంకరించి మెట్లకు ఇరువైపులా పచ్చని తోరణాలతో తీర్చిదిద్దారు. ఆదివారం జరిగే సీతాకోదండరాముని కల్యాణానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

టీటీడీ నిధులతో శ్రీరామనవమి వేడుకలు

ప్రత్తిపాడు: తిరుమల తిరుపతి దేవస్థానం నిధులతో హిందూ ధర్మ ప్రచార పరిషత్ ద్వారా సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన రామాలయాల్లో ఆదివారం శ్రీరామనవమి వేడుకలు నిర్వహించనున్నట్టు సమరసత ఫౌండేషన్ జిల్లా ధర్మ ప్రచారక్ పడాల రఘు తెలిపారు. ప్రత్తిపాడులో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు.కాకినాడ జిల్లాలోని తొమ్మిది రామాలయాల్లో వేడుకలు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాటు పూర్తిచేసినట్టు తెలిపారు. సమావేశంలో అన్నవరం ట్రస్ట్ బోర్డు మాజీ సభ్యుడు శింగిలిదేవి సత్తిరాజు, ఫౌండేషన్ మండల కన్వీనర్ తోలేటి రామకృష్ణ, జిల్లా పరియోజన ప్రముఖ్ కొప్పిశెట్టి కోటేశ్వరరావు, దేవర రామకృష్ణ పాల్గొన్నారు.

పార్టీ పటిష్టతకు కృషి చేయాలి

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా



వైఎస్సార్ సీపీ తుని మండల సెక్రటరీ జమీలును అభినందిస్తున్న దాడిశెట్టి రాజా

తుని రూరల్: క్షేత్రస్థాయిలో పార్టీ పటిష్టతకు నిరంతరం కృషి చేయాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా సూచించారు. శనివారం ఎస్.అన్నవరంలోని తన నివాసంలో దాడిశెట్టి రాజాను ఇటీవల వైఎస్సార్ సీపీ తుని మండల సెక్రటరీగా నియమితులైన వంగలపూడి జమీలు మర్యాదపూర్వకంగా కలసి, కృతజ్ఞతలు తెలిపారు. జమీలును దాడిశెట్టి రాజా అభినందించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యంగా పార్టీని బలోపేతం చేయాలన్నారు. పార్టీ పదవులు లభించిన నాయకులు గ్రామస్థాయిలో కార్యకర్తలను ఐక్యంగా ముందుకు నడపాలన్నారు. వైస్ ఎంపీపీ చోడిశెట్టి సత్యనాగేశ్వరరావు, పార్టీ నాయకులు వంగలపూడి కృష్ణారావు, కీర్తి బాలకృష్ణ పాల్గొన్నారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సు సర్వీసు

తుని: ప్రముఖ పుణ్యక్షేత్రం అరుణాచలంలో జరిగే గిరి ప్రదక్షిణకు తుని ఆర్టీసీ డిపో నుంచి ఈ నెల 11న ప్రత్యేక బస్సు సర్వీసు నడపనున్నట్లు డిపో మేనేజర్ ఎస్.కిరణ్‌కుమార్ శనివారం తెలిపారు. ఆ రోజు ఉదయం 11 గంటలకు బస్సు తునిలో బయలుదేరి విజయవాడ, శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీపురం మీదుగా అరుణాచలానికి చేరుకుంటుందన్నారు. గిరి ప్రదక్షిణ అనంతరం బస్సు కంచి మీదుగా 14వ తేదీ సాయంత్రానికి తుని చేరుకుంటుందని వివరించారు. సూపర్ లగ్జరీ బస్సు టిక్కెట్టు ధర రూ.3,500గా నిర్ణయించామన్నారు. టిక్కెట్లు కావాల్సిన భక్తులు 73829 13216, 73829 13016 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఆక్వా జోన్ల ఏర్పాటుపై గ్రామ సభలు

తొండంగి: మండల పరిధిలోని గ్రామాల్లో ఆక్వా జోన్ల ఏర్పాటుపై రెండు విడతలుగా గ్రామ సభలు నిర్వహించనున్నట్టు తుని మత్స్యశాఖ అభివృద్ధి అధికారి సీహెచ్ ఉమామహేశ్వరరావు శనివారం తెలిపారు. ఈ నెల 7న ఏవీ నగరం, బెండపూడి, రావికంపాడు, కృష్ణాపురం, వేమవరం, పైడికొండ, తుని మండలం అగ్రహారం గ్రామాల్లో సభలు నిర్వహిస్తామన్నారు. 8న పి.ఇ.చిన్నాయపాలెం, కోదాడ, ఒంటిమామిడి, తుని మండలం హంసవరం గ్రామాల్లో సభలు జరుగుతాయని వివరించారు.

పార్టీకి పూర్వ వైభవం తీసుకురావాలి



సమావేశంలో మాట్లాడుతున్న ముద్రగడ గిరిబాబు

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు
- వివిధ విభాగాల అధ్యక్షులతో సమావేశం

కిర్లంపూడి: నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేసి పార్టీకి పూర్వ వైభవం తీసుకురావాలని ఆ పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు సూచించారు. నియోజకవర్గంలోని పార్టీ వివిధ విభాగాల అధ్యక్షులుగా నియమితులైన వారితో కిర్లంపూడిలోని ముద్రగడ నివాసంలో శనివారం సమావేశం ఏర్పాటు చేశారు. గ్రామాల్లోని రాజకీయ పరిస్థితులపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం పార్టీ విధివిధానాలపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా గిరిబాబు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జరిగిన మేలును ప్రజలకు వివరించాలన్నారు. అధికార దాహంతో అమలు కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి నేతలు హామీలు అమలు చేయకుండా కాలయాపన చేస్తున్న తీరును ప్రజలకు తెలియజేయాలన్నారు. మత, కుల, ప్రతీకార చర్యలకు తావు లేకుండా ప్రజల పక్షాన పోరాడాలన్నారు. పార్టీ ఇచ్చిన పదవులను వ్యక్తిగత అజెండాకు ఉపయోగించకుండా పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. తొలుత మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నేత ముద్రగడ పద్మనాభంతో కలిసి బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



టీజే నగరంలో తడి-పొడి చెత్త నిర్వహణపై అవగాహన కల్పిస్తున్న డీఎల్‌పీఓ బాలమణి

కోటనందూరు: పరిసరాల పరిశుభ్రతను అందరూ బాధ్యతగా తీసుకోవాలని డివిజినల్ పంచాయతీరాజ్ అధికారి (డీఎల్‌పీఓ) బాలమణి సూచించారు. మండలంలోని టీజే నగరంలో శనివారం డీఎల్‌పీఓ పర్యటించారు. స్థానిక అధికారులతో కలిసి ఇంటింటికీ వెళ్లి తడి-పొడి చెత్త నిర్వహణపై మహిళలకు అవగాహన కల్పించారు. చెత్త సేకరణపై ఆరా తీశారు. ఇళ్లలోనే చెత్తను తడి, పొడి చెత్తలుగా విడదీసి గ్రీన్ అంబాసిడార్లకు అందజేయాలని సూచించారు. ఈ సందర్భంగా డీఎల్‌పీఓ బాలమణి మాట్లాడుతూ ప్రజారోగ్య పరిరక్షణకు పరిసరాల పరిశుభ్రత కీలకమన్నారు. ఇళ్ల నుంచి వచ్చే చెత్త, మురుగునీరు రోడ్డుకుపైకి రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. సీఎం కార్యాలయం నుంచి వచ్చే ఐవీఆర్ఎస్ ఫోన్ కాల్స్‌కు సమగ్ర సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ సుర్ల రాంబాబు, పంచాయతీ కార్యదర్శి గాలి వెంకటపద్మ తదితరులు పాల్గొన్నారు.

సర్వే త్వరితగతిన పూర్తి చేయాలి



సమావేశంలోమాట్లాడుతున్న తహసీల్దార్ మురార్జీ

తొండంగి: గ్రామాల్లో అక్రమ నివాస స్థలాలను క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని తహసీల్దార్ మురార్జీ ఆదేశించారు. మండలంలోని వీర్వోలు, గ్రామ సర్వేయర్లతో శనివారం ఆయన సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం జారీచేసిన జీవో నంబర్ 30 ప్రకారం అక్రమ నివాస స్థలాలను క్రమబద్ధీకరించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ రాజారావు, సర్వేయర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా కలెక్టర్ షణ్మోహన్



ఇర్రిపాకలో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న కలెక్టర్ షణ్మోహన్, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

జగ్గంపేట: ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సూచించారు. పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా జగ్గంపేట మండలం ఇర్రిపాకలో శనివారం ఆయన పర్యటించారు. పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఉపాధి హామీ పథకంలో రూ.50 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, గోకులం షెడ్లను స్థానిక ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూతో ప్రారంభించారు. మండలంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను అధికారులు జిల్లా కలెక్టర్‌కు వివరించారు. అనంతరం ఇర్రిపాకలో వేంకటేశ్వరస్వామి, కోటిలింగేశ్వరస్వామి విగ్రహాలను కలెక్టర్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇర్రిపాకలో ఏర్పాటు చేసిన ద్వాదశ జ్యోతిర్లింగాల విశిష్టతను ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ కలెక్టర్‌కు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్, తహసీల్దార్ జేవీఆర్ రమేష్, ఎంపీడీఓ చంద్రశేఖర్, పంచాయతీరాజ్ ఈఈ జీ.మల్లికార్జున, డీఈ ఉమాశంకర్ పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు జగ్జీవన్‌రామ్

- వైఎస్సార్ సీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా
- బొద్దవరంలో విగ్రహావిష్కరణ
- ఘనంగా బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు



బొద్దవరంలో బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న దాడిశెట్టి రాజా, యనమల కృష్ణుడు

కోటనందూరు: విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన బాబూ జగ్జీవన్ రామ్ జీవితం నేటి యువతకు ఆదర్శమని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా అన్నారు. బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకుని మండలంలోని బొద్దవరంలో ఆదియాంధ్ర యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని శనివారం వైఎస్సార్ సీపీ నాయకుడు యనమల కృష్ణుడితో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దాడిశెట్టి రాజా మాట్లాడుతూ భారతదేశ తొలి ఉపరాష్ట్రపతిగా పని చేసిన జగ్జీవన్‌రామ్ అన్నివర్గాల అభ్యున్నతికి కృషి చేశారన్నారు. బాబూ జగ్జీవన్‌రామ్ పేదల పక్షపాతి అని కొనియాడారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు యనమల కృష్ణుడు మాట్లాడుతూ సమాజాభివృద్ధే బాబూ జగ్జీవన్‌రామ్ అభిమతమన్నారు. జగ్జీవన్‌రామ్ సూచించిన సమ సమాజస్థాపనకు యువత కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సెల్ జనరల్ సెక్రటరీ గొర్లి రామచంద్రరావు, లోవదేవస్థానం మాజీ చైర్మన్ లాలం బాబ్జీ, వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం తుని నియోజకవర్గ అధ్యక్షుడు వెలగా వెంకట కృష్ణాజీ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చింతకాయల చినబాబు, నాయకులు వేగి అప్పలనాయుడు, దొడ్డి బాబ్జీ, నల్లమిల్లి గోవిందు, పసగడుగుల వరహాలు, సుర్ల రాంబాబు, కొరుప్రోలు కృష్ణ, కుంచే అచ్చిరాజు, బొత్స సత్తిబాబు, దార్ల సూర్యచంద్ర, ఉల్లూరి శ్రీను ఆదియాంధ్ర యువజన సేవా సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్‌కు భారతరత్న ఇవ్వాలి

తుని: స్వాతంత్ర సమరయోధుడు, అణగారిన వర్గాల ఆశాజ్యోతి, భారత ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్‌కు భారత రత్న ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ ఉమ్మడి గోదావరి జిల్లాల అధ్యక్షుడు ముప్పిడి శ్యామ్‌కుమార్ కోరారు. శనివారం తుని పట్టణంలోని కొండవారిపేట, వీరవరపుపేటలో బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. జగజ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దళిత నాయకులు జుత్తుక సంజయ్, కుందేటి జాన్, మామిడి రాజా, సత్తిబాబు, చీలి ప్రసాద్, సాకా నూకరాజు, సగరపు రాజు, ఆనంద్, రాంబాబు, జానీ పాల్గొన్నారు.

ఏలేశ్వరం: దేశ మాజీ ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను నియోజకవర్గవ్యాప్తంగా శనివారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని జె.అన్నవరంలో జగ్జీవన్‌రామ్ నూతన విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, బొదిరెడ్డి గోపి, మూది నారాయణస్వామి, జ్యోతుల పెదబాబు పాల్గొన్నారు. పెద్దనాపల్లిలో ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక పెద్దవీధి ఎస్సీపేటలో ఎమ్మార్పీస్ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి జగ్జీవన్‌రామ్ చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో దళిత నాయకులు యండగండి నాగబాబు, కాకాడ నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

రౌతులపూడి: స్థానిక ఆదిఆంధ్రా కమ్యునిటీ హాలు వద్ద నిర్వహించిన జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకల్లో ఎంపీపీ గంటిమళ్ల రాజ్యలక్ష్మి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జగ్జీవన్ రామ్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కె.అర్జునమ్మ, ఉపసర్పంచ్ వాసిరెడ్డి భాస్కరబాబు, మాజీ ఎంపీపీ ఇటంశెట్టి సూర్యభాస్కరావు, పైల వేణుగోపాల్, బర్రే రాజేశ్వరరావు పాల్గొన్నారు.

తుని రూరల్: బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా మండలంలోని ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తేటగుంటలో బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. లోవకొత్తూరు, ఎస్.సూరవరం, టి.తిమ్మాపురం, రాపాక, డి.పోలవరం, హంసవరం, తదితర గ్రామాల్లో విగ్రహాలకు స్థానిక నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ప్రత్తిపాడు: స్థానిక జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ఆవరణలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి న్యాయమూర్తి కాటం భాను ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి కాటం భాను మాట్లాడుతూ పేదల అభ్యున్నతికి, బడుగు బలహీన వర్గాల పురోభివృద్ధికి పాటుపడిన మహోన్నత వ్యక్తి జగజ్జీవన్‌రామ్ అని కొనియాడారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజాల చిట్టిబాబు, ప్రధాన కార్యదర్శి బొంగుకూరి మధుబాబు, బలాజ్ రాష్ట్ర కార్యదర్శి బుగత శివ, బార్ ప్రతినిధులు మళ్ల గంగాధర్, బత్తిన సింహాచలం పాల్గొన్నారు. కాగా స్థానిక ఆటో స్టాండ్ వద్ద గల బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి ఎస్సై ఎస్. లక్ష్మీకాంతం, కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బాబూ జగజ్జీవన్ రామ్ చిత్రపటానికి పీసీసీ సభ్యుడు ధరణాలకోట శ్రీను పూలమాల వేసి నివాళులర్పించారు.

గోకవరం: స్థానిక సంజీవయ్యనగర్‌లో ఎంఎస్‌పీ నాయకుడు గరబారపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర వీరబాబు, ఎంపీటీసీ సభ్యురాలు తోలేటి రమ్యశ్రీ, ఎంపీటీసీ మాజీ సభ్యుడు పులపర్తి బుజ్జి ముఖ్య అతిథులుగా పాల్గొని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రంపయర్రంపాలెంలో పంచాయతీ కార్యదర్శి గోవిందు, నాయకులు బాదంపూడి ప్రకాష్, గంధం బుజ్జి తదితరులు బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.



గండేపల్లిలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ యువ నాయకుడు తోట రాంజీ

గండేపల్లి: గ్రామంలో బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి వైఎస్సార్ సీపీ యువ నాయకులు తోట రాంజీ పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ మండల అధ్యక్షుడు మద్దిపట్ల రామకృష్ణ, గ్రామ సర్పంచ్ రుత్తల లలిత, జగ్గంపేట మండల అధ్యక్షుడు రావుల గణేష్ రాజా తదితరులు పాల్గొన్నారు.

కిర్లంపూడి: ఎస్.తిమ్మాపురం, కిర్లంపూడి, శృంగరాయునిపాలెం, వీరవరం గ్రామాల్లోని బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు దళిత నాయకులు, ప్రజాప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

తొండంగి: బెండపూడిలో ఎస్సీపేటలో బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహానికి వైఎస్సార్ సీపీ నాయకులు ఆరుమిల్లి ఏసుబాబు, ఏలేటి ధర్మరాజు తదితరులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. గోపాలపట్నంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పలివెల సాయి, పెదపాటి సత్యనారాయణ, పెదపాటి రమేష్, తాడినాని, మాదిగ యూత్ సభ్యులు బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

జగ్గంపేట: మండలంలోని గ్రామాల్లో జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జగ్జీవన్‌రామ్ సేవలను కొనియాడారు.

షెడ్డు నిర్మాణానికి విరాళం

శంఖవరం: మండలంలోని జి.కొత్తపల్లిలో బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి షెడ్డు నిర్మాణం నిమిత్తం దాత విరాళం అందజేశారు. స్థానిక సర్పంచ్ ఈగల విజయ దుర్గ తన సొంత నిధులు రూ.12500 శనివారం సంఘ పెద్దలకు అందజేశారు. కాగా గ్రామంలోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి సర్పంచ్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఈగల అప్పారావు, ఈగల దేవుళ్లు,మఠం సత్యనారాయణ, గెద్దం పెద్దిరాజు,గంటేటి నల్లకొండ,దొండపాటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



ప్రత్తిపాడులో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జడ్జి కాటం భాను



పెద్దనాపల్లిలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి ఎంపీపీ బుజ్జి, నాయకుల నివాళి



రౌతులపూడిలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు